హర్యానా కొత్త సీఎంగా సైనీ

మనోహర్ లాల్ ఖట్టర్ రాజీనామా

- మిత్రపక్షం జేజేపీతో బీజేపీ తెగదెంపులు!
- స్వతంత్రులతో కలిసి కొత్త ప్రభుత్వం
- లోక్‌సభ ఎన్నికల ముంగిట హర్యానాలో అనూహ్య పరిణామాలు

నాయబ్ సింగ్ సైనీతో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ దత్తాత్రేయ

చండీగఢ్, మార్చి 12: సార్వత్రిక ఎన్నికలు సమీపించిన వేళ హర్యానా రాజకీయాల్లో మంగళవారం అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి పదవికి మనోహర్ లాల్ ఖట్టర్ ఊహించని విధంగా రాజీనామా చేశారు. ఆయనతో పాటు 13 మంది మంత్రులు కూడా రాజీనామా సమర్పించారు. దీంతో హర్యానాలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు అనివార్యమైంది. ఇంతకాలం జన్ నాయక్ జనతా పార్టీ(జేజేపీ)తో కలిసి అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పుడు స్వతంత్రుల మద్దతుతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ కొత్త శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ హర్యానా అధ్యక్షుడు నాయబ్ సింగ్ సైనీని బీజేపీ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో మంగళవారం సాయంత్రం హర్యానా కొత్త ముఖ్యమంత్రిగా సైనీతో గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు బీజేపీ ఎమ్మెల్యేలు కన్వర్ పాల్, మూల్‌చంద్ శర్మ, జైప్రకాశ్ దలాల్, బన్వారీలాల్, స్వతంత్ర ఎమ్మెల్యే రంజిత్ సింగ్ చౌతాలా మంత్రులుగా ప్రమాణం చేశారు. కొత్త ప్రభుత్వానికి కేవలం ఏడు నెలల పదవీకాలమే ఉంది.

జేజేపీ అవసరం లేకపోవడంతో...

90 మంది సభ్యులు ఉన్న హర్యానా అసెంబ్లీకి 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 41, కాంగ్రెస్ 30, జేజేపీ 10 సీట్లు దక్కించుకున్నాయి. ఏడుగురు స్వతంత్రులు, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్ఎల్‌డీ) నుంచి ఒకరు, హర్యానా లోఖిత్ పార్టీ(హెచ్ఎల్‌పీ) నుంచి ఒకరు విజయం సాధించారు. ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ బీజేపీకి రాకపోవడంతో జేజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ నుంచి ఖట్టర్ ముఖ్యమంత్రి అవగా, జేజేపీ అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఇంతకాలం ఈ రెండు పార్టీల ప్రయాణం సజావుగానే సాగినా పార్లమెంటు ఎన్నికలు సమీపించిన వేళ విభేదాలు తలెత్తాయి. ఈసారి ఎన్నికల్లో హర్యానాలోని రెండు లోక్‌సభ స్థానాలకు పోటీ చేయాలని జేజేపీ భావిస్తున్నది. అయితే, మొత్తం 10 స్థానాల్లోనూ తమ అభ్యర్థులనే నిలపాలని బీజేపీ నిర్ణయించినట్టు తెలుస్తున్నది. దీంతో రెండు పార్టీల మధ్య దూరం పెరిగింది.



ఖట్టర్

జేజేపీలో విభేదాలు ?

ఈ పరిణామాలు జేజేపీలో కూడా చిచ్చు పెట్టాయనే ప్రచారం జరుగుతున్నది. తాజా రాజకీయాలపై చర్చించేందుకు ఢిల్లీలోని తన ఫామ్‌హౌజ్‌లో దుష్యంత్ చౌతాలా ఏర్పాటు చేసిన సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. దీంతో జేజేపీలో చీలిక రాబోతున్నదా అనే అనుమానాలు మొదలయ్యాయి. అయితే, తమ పార్టీ ఎమ్మెల్యేలంతా ఏకతాటిపై ఉన్నారని జేజేపీ అధికార ప్రతినిధి అర్వింద్ భరద్వాజ్ పేర్కొన్నారు. తమ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 10 స్థానాల్లో పోటీ చేస్తుందని, అక్టోబరులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 90 స్థానాల్లో బరిలో దిగుతుందని స్పష్టం చేశారు.

ఓబీసీ ఓట్లే లక్ష్యంగా సీఎం ఎంపిక

బీజేపీ ఢిల్లీ పెద్దల సూచనల మేరకు, హర్యానా నివాస్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు సైనీని శాసనసభపక్ష నేతగా ఎన్నుకున్నారు. హర్యానాలో ఎనిమిది శాతంగా ఉన్న సైనీల జనాభాతో పాటు ఓబీసీల ఓట్లనూ దక్కించుకునేందుకు బీజేపీ సైనీని ముఖ్యమంత్రి పదవికి ఎంపిక చేసినట్టు కనిపిస్తున్నది. తొమ్మిదిన్నర ఏండ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్‌పై ఉన్న వ్యతిరేకత ప్రభావం లోక్‌సభ ఎన్నికల్లో, తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పడొద్దనేది కూడా సీఎం మార్పు వెనుక బీజేపీ పెద్దల ఉద్దేశమని తెలుస్తున్నది.

ఎవరీ నాయబ్ సింగ్ సైనీ ?

మాజీ ముఖ్యమంత్రి ఖట్టర్‌కు సైనీ సన్నిహితుడు. అంబాలా జిల్లా మిర్జాపూర్ మజ్రా గ్రామానికి చెందిన సైనీకి ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉంది. 2014లో ఆయన మొదటిసారి నారాయణ్‌గఢ్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ఖట్టర్ మొదటి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కురుక్షేత్ర నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థిపై 3.84 లక్షల భారీ మెజారిటీతో విజయం సాధించారు. గత అక్టోబరులోనే ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. కాగా, సీఎం పదవి నుంచి తప్పుకున్న ఖట్టర్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు తెలుస్తున్నది.

ఆధార్ ఉచిత అప్‌డేట్ జూన్ 14 వరకు

గడువు పెంచిన ఉడాయ్

న్యూఢిల్లీ, మార్చి 12: ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువును మరో మూడు నెలలు పొడిగిస్తూ 'భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ' (ఉడాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. ఉచిత అప్‌డేట్ ప్రస్తుత గడువు మార్చి 14తో ముగుస్తుండగా, దీనిని జూన్ 14 వరకు పెంచింది. ఈ మేరకు 'ఉడాయ్' మంగళవారం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. దీని ప్రకారం జూన్ 14 వరకు ఆధార్‌లో మార్పులు ఉచితంగా చేసుకోవచ్చు. ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఉడాయ్ పేర్కొన్నది. ఆధార్ తీసుకొని 10 ఏండ్లు పూర్తయిన వారు తమ డెమోగ్రాఫిక్ వివరాలు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం లేటెస్ట్ గుర్తింపు కార్డు, చిరునామా వివరాలు అందజేయాలి. ఉచిత సేవలు 'మై ఆధార్ పోర్టల్' ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయని 'ఉడాయ్' మరోమారు స్పష్టం చేసింది. అలాగే సమీపంలోని ఆధార్ సేవా కేంద్రాల్ని సందర్శించి ఆఫ్‌లైన్‌లోనూ ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయవచ్చునని తెలిపింది. రేషన్ కార్డు, ఓటర్ ఐడీ, కిసాన్ ఫొటో పాస్‌బుక్, పాస్‌పోర్ట్ వంటివి గుర్తింపు, చిరునామా.. రెండింటికీ ధ్రువీకరణ పత్రాలుగా వాడొచ్చు. టీసీ, మార్క్‌షీట్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్.. వంటివి గుర్తింపు పత్రాలుగా ఉపయోగపడతాయని ఉడాయ్ పేర్కొన్నది.

ఈసీకి ఎన్నికల బాండ్ల వివరాలు

- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు ఎస్బీఐ సమర్పణ
- మూడు రోజుల్లో ఈసీ వెబ్‌సైట్‌లో!

న్యూఢిల్లీ, మార్చి 12: సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎట్టకేలకు ఎలక్టోరల్ బాండ్ల వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) మంగళవారం ఎన్నికల కమిషన్‌కు సమర్పించింది. మంగళవారం పని వేళలు ముగిసే నాటికి ఎలక్టోరల్ బాండ్ల వివరాలను కచ్చితంగా ఈసీకి ఇవ్వాల్సిందేనని సోమవారం ఎస్బీఐని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. జూన్ 30 వరకు సమయం ఇవ్వాలని ఎస్బీఐ చేసిన విజ్ఞప్తిని సైతం సుప్రీంకోర్టు తిరస్కరించింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్బీఐ సమర్పించిందని ఎన్నికల కమిషన్ ఎక్స్‌లో ప్రకటించింది. మార్చి 12 నాటికి బాండ్ల వివరాలను ఈసీకి ఇవ్వాలని, మార్చి 15 సాయంత్రం 5 గంటల నాటికి ఈ వివరాలను ఈసీ అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టాల్సిందేనని సుప్రీం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దీంతో మూడు రోజుల్లో ఎలక్టోరల్ బాండ్లు ఏ పార్టీకి ఎన్ని వచ్చాయి, ఎవరెవరు ఇచ్చారనే విషయాలు ఈసీ వెబ్‌సైట్ ద్వారా బహిర్గతం కానున్నాయి.

ఇప్పటివరకు 16,518 కోట్లు

రాజకీయ పార్టీలకు వచ్చే నిధుల్లో పారదర్శకతను తీసుకువస్తామని చెప్పూ, నగదుగా నిధులను తీసుకోవడానికి బదులుగా 2018 జనవరి 2న కేంద్రం ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. కేవలం ఎస్బీఐకి మాత్రమే ఎలక్టోరల్ బాండ్లను విక్రయించే అధికారం ఇచ్చింది. దీంతో 2018 మార్చి నుంచి ఇప్పటివరకు 30 విడతలుగా ఎస్బీఐ రూ.16,518 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను విక్రయించింది. ఎవరు ఇచ్చారు, ఏయే పార్టీలకు ఇచ్చారనే వివరాలు మాత్రం ఇప్పటి వరకు బయటకు వెల్లడి కాలేదు. అజ్ఞాత వ్యక్తుల నుంచి నిధులు పొందేందుకు అవకాశం ఇస్తున్న ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్న సుప్రీంకోర్టు ఫిబ్రవరి 15న ఈ పథకాన్ని రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది.

గుజరాత్ తీరంలో 480 కోట్ల డ్రగ్స్ పట్టివేత

న్యూఢిల్లీ: గుజరాత్ తీరంలో మరోసారి పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడ్డాయి. పోర్‌బందర్‌కు 350 కిలోమీటర్ల దూరంలో అరేబియా సముద్రంలో సోమవారం రాత్రి చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో రూ.480 కోట్ల విలువైన డ్రగ్స్‌తో పాక్ పడవ ఒకటి పట్టుబడిందని అధికారులు వెల్లడించారు. అందులోని ఆరుగురు పాకిస్థానీలను అరెస్ట్ చేశామని చెప్పారు. ఇండియన్ కోస్ట్ గార్డ్, గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను నిర్వహించినట్టు తెలిపారు.ఫిబ్రవరి 26న 3,300 కిలోల డ్రగ్స్‌తో పోర్‌బందర్ వద్ద ఐదుగురు విదేశీయులు పట్టుబడిన సంగతి తెలిసిందే.

జేకేఎన్ఎఫ్‌పై నిషేధం

న్యూఢిల్లీ: కశ్మీర్ వేర్పాటువాదాన్ని బలంగా వినిపించే 'జమ్ముకశ్మీర్ నేషనల్ ఫ్రంట్' (జేకేఎన్ఎఫ్)పై కేంద్రం ఐదేండ్ల పాటు నిషేధం విధించింది. 'ఉపా' చట్టం కింద ఈ చర్యలు తీసుకుంది. జేకేఎన్ఎఫ్ ఆ రాష్ట్రంలో ప్రజల మధ్య అసంతృప్తి బీజాలు నాటుతున్నదని, దేశ భద్రత, సార్వభౌమత్వానికి హాని తలపెట్టే కార్యకలాపాల్లో మునిగి తేలుతున్నదని ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

ఎన్నికల్లో తప్పుడు సమాచారానికి చెక్!

ఈసీతో చేతులు కలిపిన గూగుల్

న్యూఢిల్లీ, మార్చి 12: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తప్పుడు సమాచార వ్యాప్తిని అడ్డు కొనేందుకు కేంద్ర ఎన్నికల సంఘంతో గూగుల్ చేతులు కలిపింది. అధీకృత సమాచారాన్ని మాత్రమే అందించడంతోపాటు కృత్రిమ మేధ ఆధారంగా జెనరేట్ చేసిన డాటాకు లేబుల్ వేయాలని నిర్ణయించింది. ఓటరుగా ఎలా నమోదు చేసుకోవాలి, ఓటు ఎలా వేయాలి వంటి కీలక ఎన్నికల సమాచారాన్ని తమ బ్రౌజర్‌లో యూజర్లు సులువుగా తెలుసుకునేందుకు ఈసీతో జట్టు కట్టామని, ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఈ సమాచారం లభిస్తుందని తెలిపింది. కంటెంట్ క్రియేట్ చేసేందుకు ఎక్కువ మంది ఏఐని వినియోగిస్తున్న నేపథ్యంలో, ఏఐ కంటెంట్‌ను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు వివరించింది. యూట్యూబ్‌లో ఏఐ ఫీచర్లతో రూపొందించిన వీడియోలకు ఇప్పటికే లేబులింగ్ వేయడం ప్రారంభించామని తెలిపింది. గూగుల్‌కు చెందిన ఏఐ జెమిని విషయంలోనూ గూగుల్ కీలక నిర్ణయం తీసుకున్నది. ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా ఆంక్షలు విధించినట్టు తెలిపింది.

పోఖ్రాన్‌లో భారత్ శక్తి

స్వదేశీ ఆయుధ సామర్థ్యాన్ని చాటిన త్రివిధ దళాలు

పోఖ్రాన్, మార్చి 12: రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో త్రివిధ దళాలు 'భారత్ శక్తి' పేరిట విన్యాసాలు నిర్వహించాయి. దేశీయ ఆయుధ సామర్థ్యాన్ని చాటిచెప్పాయి. తేలికపాటి యుద్ధ విమానం తేజస్, ఎల్‌హెచ్ ఎంకే-IV యుద్ధ ట్యాంక్, కే-9 వజ్ర, ధనుష్, శరంగ్ యుద్ధ తుపాకుల వ్యవస్థ ఫైరింగ్ రేంజ్ సామర్థ్యాన్ని క్షేత్ర స్థాయిలో ప్రదర్శించారు. విన్యాసాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రధాని మోదీ, మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు.

కుప్పకూలిన తేజస్

- జైసల్మేర్‌లో ప్రమాదం
- సురక్షితంగా బయటపడిన పైలట్
- తేజస్ కూలడం ఇదే తొలిసారి

జైసల్మేర్/న్యూఢిల్లీ, మార్చి 12: భారత వైమానిక దళానికి చెందిన తేలికపాటి యుద్ధవిమానం 'తేజస్' రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో మంగళవారం కూలిపోయింది. శిక్షణా కార్యక్రమాల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన తేజస్ యుద్ధవిమానం ప్రమాదానికి గురికావడం ఇదే తొలిసారి. దీని వల్ల ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ప్రమాదానికి ముందే విమానం నుంచి పైలట్ సురక్షితంగా బయటపడ్డాడని, ఈ ప్రమాదానికి కారణాలేమిటో తేల్చేందుకు విచారణకు ఆదేశించామని భారత వాయుసేన (ఐఏఎఫ్) వెల్లడించింది. రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఎడారికి దాదాపు 100 కి.మీ. దూరంలో ఈ ప్రమాదం జరిగింది. కల్లా, జవహర్ రెసిడెన్షియల్ కాలనీల వద్ద ఈ విమానం కూలిపోవడంతో ఓ హాస్టల్ భవనంలో కొంత భాగం ధ్వంసమైందని, ఆ సమయంలో ఆ భవనంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని పోలీస్ అధికారులు తెలిపారు. హెచ్ఏఎల్ సంస్థ పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తేజస్ యుద్ధవిమానాలను తయారు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దాదాపు 40 తేజస్ యుద్ధవిమానాలను వాయుసేనలో ప్రవేశపెట్టారు. ఐఏఎఫ్ కోసం 83 తేజస్ ఎంకే-1ఏ విమానాలను కొనుగోలు చేసేందుకు 2021లో హెచ్ఏఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న రక్షణ శాఖ.. వాయుసేన కోసం అదనంగా మరో 97 తేజస్ విమానాలను సమీకరించేందుకు గతేడాది నవంబర్‌లో ప్రాథమిక ఆమోదం తెలిపింది.

'జీరో ఫుడ్' చిల్డ్రన్.. భారత్‌లోనే అధికం

- ఆకలితో అలమటిస్తున్న 67 లక్షల మంది బాలలు
- హార్వర్డ్ వర్సిటీ అధ్యయనం

న్యూఢిల్లీ, మార్చి 12: ప్రపంచంలో అత్యధికంగా భారత్‌లోనే 'జీరో ఫుడ్' చిల్డ్రన్ ఉన్నారని, 67 లక్షల మంది పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారని 'హార్వర్డ్ స్టడీ' వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 92 దేశాల్లో అధ్యయనం చేయగా, సగం మంది బాలలు భారత్‌లోనే ఉన్నారని నివేదిక పేర్కొన్నది. 'జీరో ఫుడ్' చిల్డ్రన్ దేశాల్లో భారత్ తర్వాత నైజీరియా (9,62,000 మంది బాలలు), పాకిస్థాన్ (8,49,000), ఇథియోపియా (7,72,000), డీఆర్ కాంగో (3,62,000) ఉన్నాయి. రోజులో ఎలాంటి ఆహారం, కనీసం తాగడానికి పాలు కూడా దొరకని పరిస్థితుల్లో చిన్నారులుంటే (6-23 నెలల వయసు) వారిని 'జీరో ఫుడ్' చిల్డ్రన్‌గా పేర్కొంటారు. పశ్చిమ ఆఫ్రికాలోని గినియా, బెనిన్, లైబీరియా, మాలీ దేశాల్లో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే దీనికి ఏమాత్రమూ తీసిపోని అధ్వాన పరిస్థితిలో భారత్‌లో 67లక్షల మంది బాలలున్నారని, ఇది 92 దేశాల్లో మొత్తం 'జీరో ఫుడ్' చిల్డ్రన్ సంఖ్యలో సగానికి సమానమని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. హార్వర్డ్ సెంటర్ ఫర్ పాపులేషన్, డెవలప్‌మెంట్ స్టడీస్ సైంటిస్టు రాక్లి కిమ్, ప్రొఫెసర్ ఎస్‌వీ సుబ్రమణియన్, 2,76,379 మంది బాలలపై అధ్యయనం చేసి ఈ నివేదికను రూపొందించారు. అయితే ఈ నివేదికను కేంద్రం ఖండించింది.

కమల్‌నాథ్, గెహ్లోట్ కుమారులకు టికెట్లు

43 మంబితో కాంగ్రెస్ రెండో జాబితా

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ మంగళవారం 43 మంది అభ్యర్థులతో రెండో జాబితాను విడుదల చేసింది. సీనియర్ నేత కమల్‌నాథ్ కొడుకు నకుల్‌నాథ్ మరోసారి మధ్యప్రదేశ్‌లోని చింద్వారా నుంచి, మరో సీనియర్ నేత అశోక్ గెహ్లోట్ కుమారుడు వైభవ్ రాజస్థాన్‌లోని జలోర్ నుంచి లోక్‌సభకు పోటీ చేయనున్నారు. గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, అస్సాం, డామన్ & డయ్యూలలోని 60 స్థానాల అభ్యర్థులపై సోమవారం కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో చర్చ జరిగింది. కానీ 43 స్థానాలకే అభ్యర్థులను ప్రకటించారు.

నీళ్ల కోసం నిలువెత్తు నిరసనలు - నీటి సంక్షోభం తీవ్రమైన నేపథ్యంలో కర్ణాటక కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా మంగళవారం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో పెద్ద సంఖ్యలో ధర్నా నిర్వహిస్తున్న మహిళలు.

బ్రిటన్ వీసా నిబంధనలు కఠినతరం

విదేశీ వర్కర్లు కుటుంబ సభ్యులను తీసుకురాకుండా ఆంక్షలు

లండన్: విదేశీ వర్కర్ల వీసా నిబంధనలను బ్రిటన్ ప్రభుత్వం కఠినతరం చేసింది. వలసలకు అడ్డుకట్ట వేయడం కోసం విదేశీ వర్కర్లు తమ కుటుంబ సభ్యులను తీసుకురాకుండా ఆంక్షలు విధించింది. వచ్చే వారం నుంచి ఈ నిబంధనలు అమలు కానున్నాయి. లక్ష మంది వర్కర్లకు తోడుగా 1.20 లక్షల మంది కుటుంబసభ్యులు రావడంతో ఈ కొత్త నిబంధనలు తీసుకొచ్చినట్లు యూకే హోమ్ ఆఫీస్ తెలిపింది. ఈ నిబంధనలతో వలసలను సంతులిత స్థాయికి తీసుకురావాలని సునాక్ సర్కారు భావిస్తున్నది. కొత్త నిబంధనల ప్రకారం వీసా దరఖాస్తుదారుల, వలసదారుల కేర్ ప్రొవైడర్లు కేర్ క్వాలిటీ కమిషన్ వద్ద తమ వివరాలు నమోదు చేసుకోవాలి. యూకేలో డిగ్రీ చదివే అంతర్జాతీయ విద్యార్థులు ఇకపై తమ పిల్లలు, తల్లిదండ్రులు లేదా తమపై ఆధారపడిన ఇతర వ్యక్తులను తీసుకురావడానికి వీలుండదు. డిగ్రీ అయ్యాక ఆరు నెలల్లోగా ఉద్యోగం తెచ్చుకోవాలి. లేదంటే దేశం విడిచి వెళ్లిపోవాలి.

మరో పది వందే భారత్ రైళ్లు

ప్రారంభించిన ప్రధాని మోదీ

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా మరో పది వందేభారత్ రైళ్లను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. దీంతో మొత్తం వందే భారత్ రైళ్ల సంఖ్య 50 దాటింది. కొత్త రైళ్లలో సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య రెండో వందే భారత్ రైలు కూడా ఉంది. ఈ కొత్త రైళ్లతో పాటు ఇప్పటికే ఉన్న నాలుగు వందే భారత్ రైళ్లు నడిచే దూరాన్ని పెంచారు. దేశవ్యాప్తంగా రూ.85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో నిర్మించిన గూడ్స్ షెడ్డును కూడా ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. సికింద్రాబాద్‌లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొనగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. చర్లపల్లి టెర్మినల్ పనులు త్వరలోనే పూర్తవుతాయని, కాజీపేటలో రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

సీఏఏకు పోర్టల్

- ప్రారంభించిన కేంద్రప్రభుత్వం
- త్వరలోనే మొబైల్ అప్లికేషన్
- సీఏఏపై భగ్గుమన్న నిరసనలు
- అస్సాం, కేరళ లో ఆందోళనలు
- సీఏఏను అమలుచేయబోమన్న బెంగాల్, తమిళ నాడు సీఎంలు

సీఏఏకు వ్యతిరేకంగా గువాహటిలో అఖిల అస్సాం విద్యార్థుల సమాఖ్య కాగడాల ర్యాలీ

న్యూఢిల్లీ/గువాహటి, మార్చి 12: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ నుంచి శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు సీఏఏ కింద దరఖాస్తుల స్వీకరణ కోసం మంగళవారం పోర్టల్‌ను ప్రారంభించింది. అర్హులైన వారు indiancitizenshiponline.nic.in పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. త్వరలోనే 'సీఏఏ-2019' పేరిట మొబైల్ అప్లికేషన్ కూడా అందుబాటులోకి తేనున్నట్టు వెల్లడించారు. సీఏఏపై ఆందోళన వ్యక్తం చేస్తున్న ముస్లింలకు కేంద్ర హోం శాఖ భరోసా ఇచ్చింది. ఈ నోటిఫికేషన్ ప్రభావం వారి పౌరసత్వంపై పడుతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది.

సీఏఏ అమలు చేయబోం

సీఏఏను తమ రాష్ట్రంలో అమలుచేయబోమని తమిళనాడు, బెంగాల్ సీఎంలు స్టాలిన్, మమతాబెనర్జీ స్పష్టంచేశారు. సీఏఏ నిబంధనలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణానికి వ్యతిరేకంగా ఉన్నాయని, ప్రజల్లో విభజన తేవడానికి తప్ప దీని వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని స్టాలిన్ విమర్శించారు. బహుళత్వం, లౌకికవాదం, మైనారిటీ వర్గాలు, శ్రీలంక తమిళ శరణార్థులకు వ్యతిరేకంగా ఉన్న ఈ చట్టాన్ని అమలు చేయబోమని తెగేసి చెప్పారు. సీఏఏ నిబంధనలు వివక్షాపూరితంగా ఉన్నాయని మమతాబెనర్జీ పేర్కొన్నారు. దీనికి దరఖాస్తు చేసే ముందు ప్రజలు పలుమార్లు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

వెల్లువెత్తిన నిరసనలు

సీఏఏకు వ్యతిరేకంగా అస్సాంలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలతో పాటు సీఏఏ చట్టం కాపీలను నిరసనకారులు తగులబెట్టారు. 16 పార్టీల ఐక్య విపక్షాల కూటమి యునైటెడ్ అపోజిషన్ ఫోరమ్ అస్సాం (యూఓఎఫ్ఏ) 12 గంటల హర్తాళ్‌కు పిలుపునిచ్చింది. పలు జిల్లాల్లో వ్యాపార సంస్థలను మూసివేశారు. కేరళలో అధికార ఎల్డీఎఫ్, విపక్ష యూడీఎఫ్ నిరసన ర్యాలీలు నిర్వహించాయి.

సీఏఏకు వ్యతిరేకంగా సుప్రీంలో పిటిషన్

సీఏఏని సవాల్ చేస్తూ మంగళవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. సీఏఏ రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ గతంలో సుప్రీంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయని, వీటిపై విచారణ పెండింగ్‌లో ఉన్నందున సీఏఏ అమలుపై స్టే విధించాలని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ సుప్రీంకోర్టును కోరింది.

పంపు కొట్టు.. మద్యం పట్టు!

ఝాన్సీ(యూపీ): చేతి పంపులో నీళ్లకు బదులు మద్యం రావడంతో యూపీ పోలీసులు కంగుతిన్న అసాధారణ ఘటన ఝాన్సీకి సమీపంలోని పరగణా గ్రామంలో ఇటీవల చోటు చేసుకుంది. పోలీసుల సాయంతో ఎక్సైజ్ అధికారులు ఆ గ్రామంలో దాడి చేసినప్పుడు ఈ గుట్టు రట్టైంది. గ్రామంలోని కబుత్రా దేరా ప్రాంతలో 'విభిన్నంగా' ఉన్న చాలా చేతి పంపులను చూసి ఎక్సైజ్ అధికారులకు అనుమానం వచ్చింది. వాటిని కొట్టి చూస్తే నీళ్లకు బదులు మద్యం రావడంతో అవాక్కవడం వారి వంతైంది. భూగర్భంలో లిక్కర్ పీపాలు ఉంచి చేతి పంపుల ద్వారా సులువుగా, ఎవరికీ అనుమానం రాకుండా మద్యాన్ని అమ్మవచ్చని లిక్కర్ మాఫియా భావించిందని పోలీసులు తెలిపారు. 500 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు.

శరీరం.. ప్లాస్టిక్‌మయం

శుక్రకణాల్లోనూ రేణువుల ఉనికి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): ప్లాస్టిక్ వినియోగం మానవజాతి మనుగడను ప్రశ్నార్థకం చేసే దుస్థితి దాపురించింది. అత్యంత సూక్ష్మరూపంలో గాలిలో చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు (మైక్రో, నానో ప్లాస్టిక్) గాలి, నీరు, ఆహారం ద్వారా శరీరంలోకి ప్రవేశించి హృదయం, మెదడు, మూత్రపిండాలు, కాలేయంపై దుష్ప్రభావం చూపుతున్నట్టు ఇప్పటికే పరిశోధకులు గుర్తించారు. తాజాగా తల్లిపాలలోనే కాదు పురుషుడి శుక్రకణాల్లోనూ మైక్రోప్లాస్టిక్ ఆనవాళ్లను గుర్తించినట్టు అమెరికా, ఆస్ట్రియా పరిశోధకులు తెలిపారు. 30 మంది పురుషుల నుంచి సేకరించిన శుక్రకణాలను విశ్లేషించగా.. 11 నమూనాల్లో మైక్రోప్లాస్టిక్‌ను గుర్తించినట్టు పేర్కొన్నారు.



సంత